క్లుప్తంగా

కేజీహెచ్ పిల్లల వార్డులో క్లినికల్ ల్యాబ్ ప్రారంభం



క్లినికల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : కేజీహెచ్ పిల్లల వార్డులో రక్త పరీక్షల కోసం క్లినికల్ ల్యాబ్ మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ప్రారంభించారు. గతంలో వివిధ రక్త పరీక్షల కోసం వార్డులో రోగుల పిల్లలను తీసుకు వెళ్లేవారు. కాని ఇక నుంచి వార్డులో అన్ని పరీక్షలు చేయడానికి వీలుగా ల్యాబ్ ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షలు ఇక్కడే చేసి, ఇక్కడే రిపోర్టులు ఇస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, ఆర్ఎంవో డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ : ఉన్నతాధికారుల పర్యటనల నేపథ్యంలో వార్డులు పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. మంగళవారం జోన్ పరిధిలో పర్యటించిన ఆయన పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా యంత్రాంగం అంతా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై పర్యటనలు జరుపుతున్న నేపథ్యంలో రహదారులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్తకుప్పలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రోజూ డంపర్ బిన్లలో చెత్తను యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

సీతమ్మధార : నేరాల నియంత్రణకు అందరి సహకారం అవసరమని ద్వారకా క్రైం ఎస్‌ఐ రాజు కోరారు. ద్వారకా పోలీస్‌స్టేషన్ (క్రైం) పరిధి ఆశీలమెట్టలో క్రైం పోలీసులు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం ఆటో సంఘాల ప్రతినిధులతో, ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. ప్రయాణికులు ఆటోలో ఏమైనా వస్తువులు మర్చిపోతే, వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. రాత్రి వేళల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నగరంలో శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం పలు వాహనాలు తనిఖీ చేశారు.

బీవీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వంకాయల తాతాజీ



వంకాయల తాతాజీ

అల్లిపురం: భారత వికాస్ పరిషత్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడిగా 2024–26 సంవత్సరానికి గాను నగరానికి చెందిన శ్రీకనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ)ని ఎన్నుకున్నారు. ఈ మేరకు తునిలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో బీవీపీ కమిటీ సభ్యులు కార్యవర్గ సభ్యులు వీరిని ఎన్నుకున్నట్లు బీవీపీ జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్ చంద్ జైన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎంవీవీ సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, విశాఖపట్నం నగర శాఖ అధ్యక్షుడు పి. వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి మాణిక్యాలరావు, ఎన్‌జీఎస్సీ కన్వీనర్ సీహెచ్‌వీ సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



సేవలందిస్తున్న వైద్యురాలు డాక్టర్ శ్రావణి



రోగుల పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది



ఉచిత మందులు సరఫరా చేస్తున్న సిబ్బంది



పేదల సంజీవిని

అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సేవలందిస్తున్నారు. విద్య, వైద్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ 27వ వార్డులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం పేదల ఆరోగ్య సమస్యలకు సంజీవినిలా పని చేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటోంది.

- అందుబాటులో 27వ వార్డులోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం
- ఉచితంగా 63 టెస్ట్‌లు, మందులు అందజేత
- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు సేవలు



దొండపర్తిలో డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు చక్కని సేవలందుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ అసిస్టెంట్, స్టాఫ్ నర్సులు, ఎల్‌జీఎస్, మెడికల్ స్టాఫ్‌తో పాటు సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తున్నారు. సుమారు రోజుకు 60 మంది వరకు ఈ ఆరోగ్య కేంద్రానికి రోగులు వస్తుంటారు. 63 టెస్ట్‌లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. మలేరియా, డెంగ్యూ, రక్త పరీక్షలు, హెచ్‌బీ, కిడ్నీతో పాటు ఇతర టెస్ట్‌లు చేస్తున్నారు. మందులు ఉచితంగా అందిస్తున్నారు. పరీక్షల కోసం సరికొత్త మెషీన్లు ఇక్కడున్నాయి. ప్రతి శనివారం, బుధవారం పిల్లలు, గర్భిణులకు వ్యాక్సిన్ వేస్తున్నారు. ప్రతి రోజు ప్రత్యేక వైద్యాధికారి పర్యవేక్షిస్తుంటారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఆర్థోపెడిక్ వైద్యుడు కె.రాకేష్, మంగళవారం చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ రమ్యకృష్ణ, పీడియాట్రీషియన్ డాక్టర్ గోపీచంద్, బుధవారం గైనకాలజిస్ట్ శిరీష, గురువారం ఛాతీ వైద్య నిపుణురాలు డాక్టర్ రూప, శుక్రవారం జనరల్ సర్జన్ డాక్టర్ మహరాజ్, డాక్టర్ ఠాగూర్, శనివారం ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ స్రవంతి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తారు. పలు వార్డులకు సంబంధించి ఇక్కడ ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారు. ప్రధాన వైద్యురాలు డాక్టర్ శ్రావణి, 9 మంది ఏఎన్ఎంలు, 10 మంది ఆశ వర్కర్లు, 10 మంది స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డీఈవో, ఎల్ఏఎస్ తదితరులు ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు.

గుండె సంబంధిత పరీక్షలకు సీరం కొలెస్ట్రాల్, సీరం ట్రిగ్లిసరైడ్స్, వీఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్, ఐడీఎల్ కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు చేసినప్పుడు ఎటువంటి ఆహారం, పానీయాలు తీసుకోకుండా రావలసి ఉంటుంది.

లివర్‌కు సంబంధించిన పరీక్షలు..

ఎరం టోటల్ బైలురుబిన్, సీరం డైరెక్ట్ బైలురుబిన్, ఇండైరెక్టు బైలురుబిన్, ఎస్‌జోమెటిక్ టెస్ట్, ఎస్‌జీవోటీ, సీరం అల్బుమిన్, గ్లోబలిన్ పరీక్షలకు ఎప్పుడైనా వెళ్లొచ్చు.

కిడ్నీ పరీక్షలు..

క్రియాటినిన్, యూఆర్‌ఐసీ యాసిడ్, యూఆర్ ఈఏ, సోడియం, పొటాషియం పరీక్షలు చేస్తారు. ఏ సమయంలోనైనా వెళ్లొచ్చు.

షుగర్‌కు..

ఏమీ తీసుకోకుండా బ్లడ్ షుగర్, జీటీటీ గ్లూకోస్ టెస్ట్‌లకు వెళ్లాలి. రోగి కొన్ని నియమాలు పాటించిన తర్వాత పరీక్షలు నిర్వహిస్తారు.

గర్భిణులకు..

హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్ స్క్రీనింగ్ టెస్ట్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ, హెచ్‌సీవీ, వీడీఆర్ఎల్, బ్లీడింగ్ టైం, బ్లడ్ గ్రూప్ టెస్ట్, కఫం, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కంప్లీట్ బ్లడ్ కౌంట్‌తో పాటు ఇంకా పలు రకాల పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఉచితంగా మందులు అందజేస్తారు. యూపీహెచ్‌సీలో పది పడకలు అందుబాటులో ఉన్నాయి.

ఉదయం 9 నుంచి అందుబాటులో..



ఉదయం 9 గంటల నుండి డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. సాయంత్రం 5 గంటల వరకు అన్ని వైద్య సేవలు అందుతాయి. 63 రకాల టెస్ట్‌లు, మందులు ఉచితంగా అందిస్తున్నాం. ప్రజలు ఈ హెల్త్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ శ్రావణి షారోన్, మెడికల్ ఆఫీసర్, దొండపర్తి యూపీహెచ్‌సీ

ఉచిత సేవలు ప్రజలకు వరం..



డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచిత వైద్యంతో పాటు మందులు కూడా ఉచితంగా అందిస్తూ సీఎం జగన్ దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సేవ చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది చక్కటి సేవలందిస్తున్నారు. అందుబాటులో ఉన్న వైద్య సేవలను ఈ ప్రాంత ప్రజలు చక్కగా వినియోగించుకుంటున్నారు.

– అల్లూరి గీత, దొండపర్తి

సీఎంకు ధన్యవాదాలు..



దొండపర్తి యూపీహెచ్‌సీలో 63 రకాల టెస్ట్‌లు ఉచితంగా చేస్తున్నారు. గతంలో అనారోగ్యానికి గురైతే ప్రైవేట్ ఆస్పత్రులకు పరిగెట్టేవాళ్లం. ఇప్పుడు అందుబాటులోకి ఆరోగ్య కేంద్రం రావడంతో స్థానికుల కష్టాలు తీరాయి. ఇక్కడి వైద్యులు, సిబ్బంది చక్కటి సేవలందిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– వి.శ్రీనివాసరావు, దొండపర్తి

క్రీడా మైదానం పరిశీలన



ఏయూ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్

జగదాంబ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్ మంగళవారం ఆంధ్రా యూనివర్సిటీ క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారన్నారు. ఈ నెల 9 నుంచి 13 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఇందుకు మహిళా క్రీడాకారిణులకు ఆంధ్రా యూనివర్సిటీ ఉమెన్స్ హాస్టల్లో ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. అలాగే మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఎంహెచ్‌వో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాపురంలో ఏడీసీ విశ్వనాథ్ పర్యటన



సెబాస్టియన్‌కాలనీ సమస్యలపై ఆరా తీస్తున్న ఏడీసీ విశ్వనాథ్, జెడ్సీ కృష్ణ

కంచరపాలెం : జీవీఎంసీ జోన్–5 పరిధి 41వ వార్డు జ్ఞానాపురంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ కె. విశ్వనాథ్, జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ మంగళవారం పర్యటించారు. సెబాస్టియన్ కాలనీ, రాచ వీధి, స్లీవ్ గుర్తువీధి, బాబుకాలనీ, గెడ్డ వీధి, నికోలాస్ వీధి, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ప్రాంతాల్లో పర్యటించి వార్డు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం, తడిపొడి చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌కు సూచించారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో స్కీం ఇళ్లు అధ్వానంగా ఉన్నాయని వాటికి మరమ్మతులు చేపట్టాలని కాలనీ ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వార్డులో సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వార్డు ప్రజలకు ఏడీసీ విశ్వనాథ్ హామీ ఇచ్చారు.

బొత్స ఝాన్సీకి అభినందనల వెల్లువ



బొత్స ఝాన్సీకి అభినందనలు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులైన బొత్స ఝాన్సీని మంగళవారం పలువురు పార్టీ నాయకులు కలసి అభినందనలు తెలిపారు. రెండు సార్లు పార్లమెంట్ సభ్యురాలిగా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా సేవలందించిన బొత్స ఝాన్సీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా రావడం విజయానికి సంకేతమని పార్టీ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను కలసిన వారిలో పార్టీ విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి నీలాపు రమణారెడ్డి, హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ కోశాధికారి సంజీవరెడ్డి, బాబా రీడింగ్ రూమ్ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ బోర కుమారరెడ్డి, జననేత సంపాదకులు శివకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ముగిసిన జాతీయ సదస్సు



ముగింపు సదస్సులో వక్తలు, విద్యార్థులు, అధ్యాపకులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ కమిషన్, కళాశాల భాషా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ భాషల్లో విద్య–సాంకేతిక పదజాలం ప్రాధాన్యతపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో జరిగిన సదస్సులో పలువురు వక్తలు ప్రసంగించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కళాశాల కార్యక్రమాలని, అధ్యాపకుల పనితీరుని, యాజమాన్యం ప్రోత్సాహాన్ని కొనియాడారు. అంతర్జాలం ద్వారా సాంకేతిక పదజాల నిర్మాణంలో నూతన పోకడలను వివరించారు. సాంకేతిక పదజాలం వినియోగంలో ప్రాంతీయ భాషల ప్రాధాన్యతను గుర్తిస్తూ తెలుగు, హిందీ భాషల్లో సీఎస్‌టీటీ సంస్థ తమ కళాశాలలో సదస్సు నిర్వహించడం గర్వ కారణమన్నారు. సుమారు 120 మంది ఉత్సాహంగా పాల్గొని వక్తల ప్రసంగాలు ఎంతో జ్ఞానదాయకంగా, ఉపయోగంగా ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్, ద్వితీయ భాషా విభాగాధ్యక్షురాలు, కన్వీనర్ పి.కె. జయలక్ష్మి, సిస్టర్లు మెర్సీ నాన్సీ జైన్ థామస్, డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి, సిస్టర్ జైన్ థామస్ తదితరులు పాల్గొన్నారు.

16న రవాణా రంగం బంద్‌కు పిలుపు



మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

డాబాగార్డెన్స్ : దేశంలో రవాణా రంగం 6 కోట్ల మందికి పైగా ఉపాధి కల్పిస్తుందని, అటువంటి రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత ఇవ్వక పోగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి నానా ఇబ్బందులకు గురి చేస్తున్న దృష్ట్యా ఈ నెల 16న రవాణా రంగం బంద్‌ను విజయవంతం చేయాలని సిటు అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, ప్రధాన కార్యదర్శి పోలినాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో రవాణా రంగం దేశాభివృద్ధిలో భాగంగా ప్రజలకు నిత్యావసర వస్తువులు చేరవేయడంలో ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఈ రంగంలో వాహనం ఓనర్ కం డ్రైవర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం భారత న్యాయ సంహిత చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. యాక్సిడెంట్ జరిగితే హిట్ అండ్ రన్ కేసుల కింద పదేళ్ల జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానాతో కేసులు పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందన్నారు. డ్రైవర్లకు సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలని, రవాణా రంగంపై భారం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జగన్, సీహెచ్ శ్రీనివాస్, జి. అప్పలరాజు పాల్గొన్నారు.

కాలువలపై ఆక్రమణలు తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ సన్యాసినాయుడు

జగదాంబ : కాలువలపై అనధికార నిర్మాణాలను గుర్తించి తొలగించాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ బి.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం ఆయన జోన్–4 కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలోని 12 వార్డుల్లో కాలువలపై ఎటువంటి కట్టడాలు ఉండకూడదన్నారు. దీని వలన పారిశుధ్యానికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అలాగే భవనాలు నిర్మాణం జరిగే చోట డెబ్రిస్ రోడ్లపై వేస్తే అపరాధ రుసుము విధించాలన్నారు. భవనాలు, కట్టడాల బయట ప్లాన్ కాపీలు అంటించే విధంగా యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. వీధులు, ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు తొలగించాలన్నారు.

వన్‌టైం రిజిస్ట్రేషన్‌పై శిక్షణ..: ప్రభుత్వం పేదలకు ఇస్తున్న ఒక సెంట్ భూమికి రిజిస్ట్రేషన్ ప్రక్రియపై మంగళవారం జోనల్ కార్యాలయంలో జెడ్సీ సన్యాసినాయుడు వార్డు ఎడ్మిన్, వీఆర్వో, డాటా ప్రాసెసింగ్ అధికారికి శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

క్యూపీఆర్ విధానం పట్ల అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ మన్మథరావు

మహారాణిపేట : రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, క్యూపీఆర్ విధానం పట్ల విద్యార్థులకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆంధ్రా మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మన్మథరావు అన్నారు. వైద్య విద్యార్థుల కోసం మంగళవారం ఏఎంసీలో క్యూపీఆర్ (క్వశ్చన్ పరూ రిఫర్) గేట్ కీపర్ ట్రైనింగ్ సెషన్‌లో ఆయన వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆత్మహత్యల నివారణ, ప్రజల మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో క్యూపీఆర్ గేట్ కీపర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వైద్య విద్యార్థులంతా దీని పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.కార్యక్రమంలో సైకియాట్రీ హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల సెస్ బకాయిలు చెల్లించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొండా రాజీవ్‌గాంధీ

డాబాగార్డెన్స్ : విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థకి జీవీఎంసీ ద్వారా రావాల్సిన సెస్ బకాయిలు చెల్లించాలని ఆ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ మంగళవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక సంస్థలకి వచ్చే ఇంటి పన్నులో 8 శాతం గ్రంథాలయాలకు చెల్లించాలని, అయితే గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఒక్క జీవీఎంసీ మాత్రమే రూ.140 కోట్ల మేర బకాయి పడిందని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక, జీవీఎంసీ పాత బకాయిలు కాకుండా, ప్రతి నెలా 50 లక్షలు చెల్లిస్తామని, జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో అంగీకరించారని అన్నారు. అప్పటి నుంచి నెలకి రూ.50 లక్షలు చెల్లిస్తూ వచ్చారని, గత నాలుగు నెలలుగా చెల్లించట్లేదని కమిషనర్ దృష్టికి రాజీవ్ తీసుకొచ్చారు. అలాగే నూతన జిల్లా కేంద్ర గ్రంథాలయ నిర్మాణానికి సుమారు రూ.24 కోట్లతో అంచనాలు సిద్ధం చేస్తున్నామని, ఇప్పటికే రెండు కోట్లు విడుదల చేశామని, జీవీఎంసీ బకాయిల్లో కొంతైనా ఇస్తే నూతన కేంద్ర గ్రంథాలయ నిర్మాణానికి ఎంతో ఉపయోగపడతుందని చెప్పారు. అలాగే శిథిలావస్థలో గల రంగిరీజువీధి బాలల శాఖా గ్రంథాలయం జీవీఎంసీ భవనంలోకి మార్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ముగిసిన యజ్ఞం



కలశాలను ఊరేగిస్తున్న వాసుపల్లి జానకీరామ్ తదితరులు

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో ఏపీ మర పడవల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ జటా గంగేశ్వర రాజ శ్యామల అమ్మవారి యజ్ఞం మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ఆధ్వర్యంలో బోటు యాజమానులు శాంతి హోమం, పరమశివుడు, గంగమ్మ తల్లి, గంగేశ్వరుడు, రుద్రరాజేశ్వరుడు, రాజ శ్యామలాదేవికి సహస్ర కలశాభిషేకం, గంగా హారతి నిర్వహించారు. అనంతరం కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సముద్రంలో నిమజ్జనం చేశారు. మహిళలు పసుపు, కుంకుమ, ఇతర పూజా సామగ్రిని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు గంగమ్మ తల్లిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ, వీఎంఆర్‌డీఏ మాజీ అధ్యక్షురాలు అక్కరమాని విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జనం కోసం కలశాలను సముద్రంలోకి తీసుకెళ్తున్న జానకీరామ్

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

8న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 8న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.